# తృష్ణలో తియ్యనిది

జీవితం అంటేనే అంతకాపోలు. లేకపోతే యీ క్షణాన అందినట్లు భ్రమపెట్టి ఓహో అనుకునేంతలోనే అందకుండాపోయి పైగా ఊరిస్తున్నట్లు వెక్కిరిస్తుందా?

పోనీ... ఏ సంగతి నా కెందుకని వదిలేద్దామంటే అదిమాత్రం సాధ్యమా? జిజ్ఞాస మెదడుని తొల్చివేయకుండా ఊరుకోదే! కుతూహలం నిలవనీయదే! ఏదో ఒక ఆకర్షణ లేకపోతే అడుగుతీసి అడుగు వెయ్యడం పడదే, రేపటికోసం ఎదురుచూసే ఆశలేకపోతే నేడు నడిచేదీ గడిచేదీ ఎలాగ?

మనిషి ఎదిగాడు. ఎదుగుతూనే ఉంటాడు.

పచ్చిమాంసంతో ఆకలి తీర్చుకునే దశనుంచి పచనంలో రుచులను బేరీజు వేసే వరకూ వచ్చాడు. ఆకలి తీర్చుకోడంలో కూడా రకరకాల రుచులు కావాలి. విసుగుని ఓడించడానికి జీవితంలో వైవిధ్యం ఏర్పరచుకుంటున్నాడు. భౌతికంగానే కాదు, మానసికంగానూ క్రొత్తదనం కోసం కొట్టుకుంటూనే ఉన్నాడు.

జిజ్ఞాసకల మనిషికి జీవితం తరగని గని.

తవ్వుతున్నకొద్దీ లోతులు చూపుతూనే ఉంటుంది. ఇంకా ఉన్నాననే అంటుంది. అంత దొరికినట్లే అనిపించి అంతలోనే తప్పుకుంటుంది. ఏ సంగతి నా కెందుకులే అని వదిలేద్దామన్నా వదలనివ్వక రెచ్చగొడుతుంది. ఈ తృష్ణ అవసరమూ ఆరోగ్యదాయకమూ కూడా!

సాయంత్రం మామూలుగా వీధిలోకి బయలుదేరాను. నా ఉత్సాహానికి కారణం నా జేబులో ఒక బ్లాంక్ చెక్ ఉండడమే. నిన్నటికి నిన్న నేను పనిచేసి రిటైరయిన కంపెనీ మేనేజరు మార్కెట్ దగ్గర కనిపించి కారాపారు. నాకు కించిత్ గర్వం కలిగింది. ఆఫీసరు గారి కంటె వయసులో మాత్రమే పెద్దవాడినయిన నాకోసం వారు కారాపడమే కాక నన్ను పిలిచి కారెక్కమన్నారు.

కారు పరుగెడుతూంటే కుశల ప్రశ్నలయ్యాయి.

"విశ్వనాథం!... ఓ మంచి కుర్రాడు కావాలయ్యా. చాకులాటి వాడుండాలి. నీ అంత సిన్సియర్‌గా తెలివి తేటలుగా పనిచెయ్య గలిగేవాడు..."

"నా సీటులో ఎవరినో వేసారుకదా సార్?"

"లాభం లేదనిపించేసాడు." పెదవి విరచి "ప్చ్" ఏమిటో కుర్రవాళ్ళు... నువెళ్ళిపోయాక చెయ్యి విరుచుకున్నట్లుందనుకో. అరవయ్యేళ్ళు పైనపడుతున్నా ఆఫీసు పని ఎంత చురుకుగా చేసుకుపోయేవాడివి. అలాగ చలాకీగా... పనిచెయ్య గలిగే క్యాండిడేట్‌ని ఎంచి నా దగ్గరకు తీసుకురా. మారు మాటాడకుండా ఉద్యోగం వేయిస్తాను".

నాకు తృప్తిగా... గర్వంగా ఉంది. పని చెయ్యడం ఒకెత్తు. ప్రశంస పొందడం ఒకెత్తు.

నేను రిటైరయి ఆరు నెలలు దాటుతోంది. అయినా నా ప్రతిభని గుర్తుపెట్టుకుని నన్నభినందించడమే కాకుండా నా మీద గురుతరమయిన బాధ్యతను కూడా వేశారు, ఆఫీసరు. ఈ గుర్తింపు నన్ను కాదు

30019
20/7/05

గుఱ్ఱమెక్కించి వదిలింది.

"తప్పకుండా సర్, త్వరలోనే మీరు కోరినట్లు చురుకు అయిన కుఱ్ఱాడిని తెస్తాను. మీ దయకు నా ధన్యవాదాలు" అని సెలవు తీసుకున్నాను.

కారు దిగి యింటివైపు నడుస్తూంటే ఏవో నినాదాలు... ఊరేగింపు. మహిళా సంవత్సర సందర్భంగా వరకట్నాన్ని నిషేధించే స్లోగన్‌లు చెబుతున్నారు. నవ్వొచ్చింది. ఉద్యమాలతోటీ ఊరేగింపుతోటి బతుకులు ఉద్ధరించబడగలిగితే అంతకంటే ఏం కావాలి?

ఆడపిల్లకి పెళ్లి... మగవాడికి ఉద్యోగం. రెండూ అసాధ్యాలే అనిపించేస్తున్నాయి. కాలమహిమ!

అంతకీ అక్కడెక్కడో ఓ రాజకీయ నాయకుడు యువకులకు "కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోం"డని ఉపన్యాస మివ్వబోతే "అలాగే. మాకు లంచాలూ రికమెండేషన్లూ అవసరం లేకుండా ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేయ్యండి." అన్నారుట వాళ్లు. వాళ్ళ తప్పుకాదు. ఉన్నమాటే. ఉద్యోగం అంటే అదో యజ్ఞమైపోతూంది.

ప్రకాశానికి యీ బాధలేదు. అది వాడి అదృష్టం. రేపు వాణ్ని తీసుకెళ్లి మేనేజర్‌కి చూపిస్తాను. ప్రకాశం చురుకయినవాడు. సమయస్ఫూర్తితో మేనేజర్‌ని మెప్పించగలడు.

దేముడు వరమిచ్చినట్లు వచ్చింది అవకాశం. నిజానికి ప్రకాశానికి యీ ఉద్యోగం రాకపోయినా ఫరవాలేదు. ఎలాగయినా నెగ్గుకు రాగలడు. కాని వచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలి? నెలకి నాలుగువందల జీతం. చేదా?

మూడు గంటలకి ప్రకాశాన్ని వెంటపెట్టుకుని మానేజరు దగ్గరకి బయలుదేరాను. వాడితో ఏమీ అనలేదు. ఊరికే నాతో రమ్మన్నానంతే.

రోడ్డుమీద పదిగజాలు నడిచానో లేదో ఎదురయ్యాడు రామనాథం. రామనాథం నా ఆరోప్రాణమే.

చిన్నప్పుడు గోలీలాటలో తరువాత పేకాటలో ఇప్పుడు చదరంగంలో మేట్. రిటైరయిపోయాక (రామనాథమూ నాకంటె నెల ముందు రిటైరయ్యాడు) ఏ ఆధ్యాత్మిక కార్యక్రమానికయినా నేనూ అతనూ కలిసేవెళ్తాం. ఒరే అనుకునే స్నేహం. మా స్నేహానిదీ యించుమించు మా వయస్సే. నేను గుమాస్తానయితే వాడు బడిపంతులు. రిటైరయిపోయాం కనుక యిప్పుడిద్దరమూ ఒకటే.

ఎటొచ్చీ నా కొక్కడే కొడుకు వాడికీ ఒక్కడే కొడుకు. కాని అదనంగా ఐదుగురమ్మాయిలు.

రామనాథం ముఖం దీనంగా ఉంది.

"అలా ఉన్నావేం?" ఆత్రంగా అడిగాను.

చెబుతానన్నట్లు సైగ చేసి ప్రకాశం వంక తిరిగి "ముసిలాళ్ళతో నీకెందుక్కానీ అలా వెళ్లి తిరిగిరా..." అన్నాడు.

ప్రకాశం వెళ్లిపోయాడు.

నా చూపులో యింకా ప్రశ్నార్థకం మిగిలే ఉంది.

"బడిపంతులుగా రిటైరయ్యేసరికి మిగిలేది బిలబిలమంటూ సంతానమే. అసలే అయ్యవారి నట్టిల్లు; ఆ పైన గడ్డురోజులు. నేడో రేపో అబ్బాయికి కనీసం కోమటి కొట్లో పద్దుల గుమాస్తా పనయినా దొరక్కపోతే సంసారం నడివీధిన పడేటట్లుంది. అంటే యిప్పుడు యింట్లో ఉంటున్నామని

కానీ..." ఆకాశంవేపు చేతులు జోడించాడు.

జాలితోపాటు ఉద్రేకమూ కట్టలు తెంచుకుంది నాలో.. ఈ సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్ అంటూ మెదడులో హెచ్చరిక.

రామనాథం కష్టం నా కష్టమే అనిపించింది.

ముందూ వెనుకా ఆలోచించకుండా అనేశాను "ముష్టి ముప్పయ్ రూపాయల కోమటి గుమాస్తా దేనికి కానీ పద మీ అబ్బాయిని తీసుకెళ్లి నేను పన్జేసిన కంపెనీలో క్లర్కుని చేద్దాం"

నిజమా అన్నట్లు చూశాడు.

మా స్నేహంలో సరసాలూ ఉంటాయి. కనుక వాడు నన్ను శంకించినా ఆశ్చర్యంలేదు. జరిగినది యావత్తూ చెప్పాను. నా మాటలు నమ్మాడు. అరగంట తిరక్కుండా వాళ్లబ్బాయిని ఆఫీసరు దగ్గరికి తీసుకెళ్లడమేమిటి, అపాయింట్‌మెంట్ ఆర్డరు యిప్పించెయ్యడమేమిటి, అంతా శరవేగంతో జరిగిపోయింది.

ఇద్దరమూ పార్కు చేరుకున్నాం.

"నిజంగా... యిది... నిజమే అని నమ్మకం..." వాడికి మాటలు పెగలడం లేదు. అనుకోనంత వెలుగు హటాత్తుగా ఎదురయినా మనిషి చూపు మందగించి తీరుతుందికద. నేను నవ్వుతూ చూశాను. "నీ కొడుకు మొదటి నెల జీతం తెచ్చి నీ చేతిలో పోసేవరకూ నిజమో కాదో తేల్చుకోలేవులే!"

రామనాథం నా చేతులు పట్టుకుని "నీ మేలు జన్మలో మరచి పోలేనురా. దేముడు కూడా యింత సాయం చేస్తాడంటే నమ్మలేను. నువ్వు చాలా మంచి దేముడివి..." అన్నాడు గద్గదిక స్వరంతో.

ఒరేయ్!... పిచ్చి మాటలు కట్టి పెట్టు... నేను దేముణ్ణేమిటి. స్నేహితుణ్ణంతే, సృష్టిలో తీయనిది స్నేహమే అని అనగా వినలేదూ? స్నేహితులమధ్య కృతజ్ఞతలూ అవీ ఏమిటి?" మందలించాను.

"ఔను" అన్నాడు రామనాథం.

చీకటి పడేవరకూ కబుర్లు చెప్పుకుని ఇళ్లకు బయలుదేరాము. రాత్రి నాకు చక్కని నిద్రపట్టింది. దేముడో దయ్యమో తెలియడం లేదు నేను చూసిన ఒక బొమ్మలో యముడిలా ఉన్నాడు. ఆ భయంకర రూపాన్ని చూస్తూనే వణికిపోయాను. కొంచెం దూరంలో పడుకున్న భార్యనీ కొడుకునీ పిలవాలనుకున్నాను. కాని నోరు విడదే! మనిషిని కదలలేకపోతున్నాను. వికటాట్టహాసం... వెనువెంటనే గర్జన.

"నేను మృత్యుదేవతని, నాకు ఆకలిగా ఉంది."

చిత్రంగా అతనితో మాట్లాడ్డానికి నా నోరు ఎలాగో విడింది. "వంటింట్లో చద్ది అన్నం ఆవకాయా ఉన్నాయి. తెచ్చేదా?"

"ప్రాణాలతోకాని నా ఆకలి తీరదు. అనవసరపు తాత్సారం చెయ్యక. ముందు ఎవరి ప్రాణం తీసుకునేదో చెప్పు. నీదా, నీ భార్యదా, నీ కొడుకుదా? ఊ..."

అయ్యో!... ప్రాణంలో ప్రాణమయిన భార్య! పున్నామ నరకం నుంచి తప్పించే కొడుకు... పోనీ.. నేను బలైపోతే?... అమ్మో!..."

"ఊ..." గర్జన.

"నా భార్య" అనేశాను. క్షణం విరామం. నా కన్నుల్లో నీరు.

"మరో ప్రాణం.. అర్జంటుగా చెప్పు..." నా పీకమీద భయంకర హస్తం.

గింజుకుంటూ అన్నాను " నా కొడుకు"

ప్రసాద్ విగతజీవి ఐపోయాడు.

"మరొక్క ప్రాణి. చాలు... తొందరగా చెప్పు. నీదా, నీ స్నేహితుడు రామనాథానిదా?"

నా పీక మీదవేళ్లు బిగుసుకుంటున్నాయి. భయంతో కొయ్యకట్టుకుపోతూ చెప్పేశాను.

"రామనాథానిదే."

మృత్యుదేవత నవ్వుతూ వెళ్ళిపోయింది. అప్పుడు నాకనిపించింది. మనిషి స్వార్థపరుడు. ప్రపంచాన్నంతటినీ బలిపెట్టి అయినా సరే తన ప్రాణంకోసం తాపత్రయ పడతాడు. భార్యనీ, పుత్రుడునీ, స్నేహితుణ్నీ కోల్పోయి దుఃఖాతిశయంలో మునిగిపోయాను. పశ్చాత్తాపంతో, విచారంతో కదలలేక కట్టెలా ఐపోయాను నేను. నా భార్య పలకరింపుతో ఆశ్చర్యంగా కదిలాను.

ఓహో! ఇదంతా కలే అన్నమాట, ఎవరూ చనిపోలేదు. నిజానికి.

ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ ఆవిడ భుజాలమీద చేయి వేసి ఉద్రేకంగా అన్నాను. "సృష్టిలో తీయనిది స్నేహమే, కాని తియ్యనిది మాత్రం ప్రాణమే. సొంతప్రాణం. మరేమీ అనుకోకు, నన్ను క్షమించు."

తెల్లబోయి చూస్తూందానిద నా వైపు. జీవితం యింతే. ఉండుండి ఓ మొట్టికాయవేసి నవ్వేవాడిని ఏడిపిస్తుంది. ఓ చిలిపి పనిచేసి ఏడిచేవాళ్లను నవ్విస్తుంది. జీవితాన్ని పూర్తిగా తెలుసుకోగలగడం - గాలిని బంధించబోవడమే! పూర్తిగా కళ్ళు తెరిచాను.

✡ ✡ ✡ ✡ ✡

# విద్య యొసగును...

అర్ధరాత్రి !

చీకూచింతా ఉన్నవాళ్ళూ చీకటి వ్యాపారాలు చేసేవాళ్లూ తప్ప మామూలు మనుషులు గుర్రుపెడుతూ గాఢంగా నిద్రపోయే వేళ.

సముద్రపు ఒడ్డు.

దిక్కులేని వాళ్ళూ బలవంతంగా చావాలనుకునే వాళ్లూ తప్ప మరెవరూ ఆ వేళలో మసలని చోటు.

ఆ అర్ధరాత్రి సముద్రతీరంలో ఆశ్చర్యకరంగా ఒకరు కాదు ఇద్దరున్నారు !

చాలా సేపటి నుంచి వాళ్లిద్దరూ ఒకరినొకరు అసహనంగా చూసుకుంటూ అలాగే కూర్చున్నారు. వారు వెళ్తారేమో అనీ వీరూ, వీరు వెళ్తారేమో అని వారూ ఆశపడుతూనే అవతలి మనిషి ఉనికికి అసహనం చెందుతున్నట్లున్నారు.